



# జీవితాలతో 'సెల్'గాటం!




ప్రస్తుతం సెల్‌ఫోన్ మానవుడి దైనందిన జీవితంలో ఒక భాగమైంది. సెల్‌ఫోన్ లేనిదే గడపలేని పరిస్థితి నెలకొంది. చేసే పనిలో కొంత విరామం దొరికినా.. లేదా కాలక్షేపం కోసమైనా సెల్ ఫోన్ చూసుకునే రోజులున్నాయి. ఈ క్రమంలో కొందరు ఆన్‌లైన్‌లోకి తొంగిచూస్తున్నారు. బెట్టింగ్‌లు, గేమింగ్‌లు, లింకులు, ఇన్వెస్ట్‌మెంట్, మోసపూరిత ఉద్యోగ ప్రకటనలపైకి దృష్టి మరల్చి జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. కొంతమంది యువత తల్లితండ్రులకు తెలియకుండానే వారి ఖాతాల్లోని డబ్బులను బెట్టింగ్, గేమింగ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్, ఉద్యోగం వస్తుందేమోననే ఆశతో మోసపూరితమైన ప్రకటనలకు ఆకర్షితులమవుతున్నారు. అందులో విడతల వారీగా డబ్బులు పెట్టి చివరికి మోసపోయామని తెలుసుకొని జరిగిన నష్టాన్ని పూడ్చలేక విగత జీవులుగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో లింక్‌లు, యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. డబ్బు పోయిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. రూ.10 లక్షలకు పైగా మోసపోతే కమిషనరేట్‌లోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో, ఆలోపు అయితే స్థానిక పోలీస్‌స్టేషన్‌లలోనే ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు. - వరంగల్ క్రైం



**ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్న అమాయకులు**

- బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల వలలో యువత
- అవసరాల కోసం రుణ యాప్‌లపై పేదల మొగ్గు
- అవసరాల కోసం ఉచ్చులో పడుతున్న జనం
- బయట పడలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
- మెసేజ్, లింక్‌లకు స్పందించొద్దని సూచన
- మోసపోతే 1930ను సంప్రదించాలని సలహా

7

# మూగబోయిన జానపద ఝురి

**బలగం మొగిలయ్య కన్నుమూత**

- అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస
- పలువురి నివాళి.. భార్యకు ఆర్థిక సాయం
- దుగ్గొండిలో ముగిసిన అంత్యక్రియలు

ఆయన గొంతెత్తితే గాన మాధుర్యమే.. జానపదాలు చెబితే గంటల తరబడి రెప్పవాల్చకుం డా చూడాల్సిందే.. పద్యం అందుకుంటే గుండెలు గిల్లుమనాల్సిందే.. ఆయనే.. బుడిగ జంగాల సామాజిక వర్గానికి చెందిన పస్తం మొగిలయ్య, సంచలన విజయం సాధించిన బలగం సినిమాలో పతాక సన్నివేశంలో మానవ సంబంధాల ఔన్నత్యాన్ని వివరిస్తూ చేసిన ఆయన గానం ప్రేక్షకుల కంట తడిపెట్టించింది. బలగం సినిమాకు ఆ సన్నివేశమే హైలైట్‌గా నిలిచింది. దీంతో మొగిలయ్య పేరు తెలుగువారందరికీ సుపరిచితమైంది. అంతలా ప్రేక్షకులతో కన్నీరు పెట్టించిన మొగిలయ్య అనారోగ్యంతో గురువారం కన్ను మూశారు. స్వస్థలం దుగ్గొండిలో అంత్యక్రియలు ముగిశాయి.

- దుగ్గొండి

7



# సాదాబైనామాకు మోక్షం



రఘునాథపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏళ్ల కిందట సాదా బైనామాల రూపంలో భూములు కొనుగోలు చేసి వాటిని అనుభవిస్తున్నా వారి వద్ద సరైన రికార్డులు లేని కారణంగా ప్రభుత్వం వారిని పట్టాదారు రైతుల కింద గుర్తించలేదు. సంవత్సరం క్రితం కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ భూభారతి బిల్లు-2024ను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టడంతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం కలుగనున్నది. దీంతో సాదాబైనామా దరఖాస్తుదారుల్లో ఆనందం వెల్లువిరిసింది. ప్రభుత్వ నిర్ణయంతో కొత్త రెవెన్యూ చట్టం ఆర్వోఆర్-24 ప్రకారం గతంలో తెల్లకాగితంపై కొనుగోలు చేసిన భూములకు హక్కులు లభించనున్నాయి సాదాబైనామాల ద్వారా వ్యవసాయ భూములను కొనుగోలు చేసి పట్టాలు అందక ఇబ్బంది పడుతున్న రైతుల కష్టాలు తొలగనున్నాయి. సాదా బైనామాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు గత ప్రభుత్వం మొండిచేయి చూపింది. ధరణి పోర్టల్ రైతుల పాలిట శాపంగా మారింది. జిల్లాలో 33,305 మంది పైచిలుకు రైతులు సాదాబైనామా కోసం దరఖాస్తు చేసి పదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. భూములు సాగు చేసుకుంటున్నా పట్టాదారు పాసు పుస్తకాలు లేక ధరణిలో రికార్డులకెక్కపోవడంతో ప్రభుత్వం నుంచి లభించే ప్రయోజనాలు అందక రైతులు ఇప్పటివరకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 'భూభారతి' పేరిట నూతన ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకొచ్చేందుకు బిల్లును అసెంబ్లీలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం ప్రతీ భూకమతానికి ప్రత్యేక సంఖ్యతో కూడిన భూధార్ నంబర్‌ను కేటాయించనున్నారు.' భూభారతి' కొత్త పోర్టల్ ద్వారా సాదాబైనామాల క్రమబద్ధీకరణలో భాగంగా క్షేత్రస్థాయి విచారణ చేపట్టి సాదాబైనామాలతో భూములను కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్న రైతులందరికి పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు భరోసా, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులతో పాటు ఇతరత్రా సబ్సిడీ పథకాలు సాదాబైనామాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు అందే అవకాశం కలుగుతుంది. 2014 జూన్ 2 లోపు సాదాబైనామాల ద్వారా భూములను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు చేసుకోలేని వారి భూములను ఆర్వోఆర్ చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలను జారీ చేసేందుకు గత ప్రభుత్వం 2020 అక్టోబరు 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత నవంబరు 10వ తేదీ వరకు పొడిగించింది. మ్యాన్‌వల్‌గా కాకుండా మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 33,305 దరఖాస్తులు వచ్చాయి. 2020 అక్టోబరు 24న గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకురాగా, నవంబరు 2వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది.

- పదేళ్ల నిరీక్షణకు పడనున్న తెర
- జిల్లా వ్యాప్తంగా 33,305 దరఖాస్తులు
- తెలంగాణ భూ భారతి బిల్లు-2024ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రెవెన్యూ శాఖ మంత్రి
- అమలులోకి రానున్న ఆర్వోఆర్-24 చట్టం
- భూ సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం
- ఆర్వోఆర్-24తో సాదాబైనామాల క్రమబద్ధీకరణ

### అందకుండా పోయిన ప్రభుత్వ ప్రయోజనాలు

సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించి భూములపై హక్కులను కల్పిస్తూ రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేయాల్సిన గత ప్రభుత్వం కోర్టులో కేసు కారణంగా పెండింగ్‌లో పెట్టింది. కోర్టులో దాఖలైన పిటిషన్‌కు గత ప్రభుత్వం కౌంటర్ పిటిషన్ వేయని కారణంగానే జాప్యం దరఖాస్తులు పరిశీలనకు నోచుకోలేదు. దరఖాస్తులన్నీ తహసీల్దార్ కార్యాలయాల్లోనే ఉండిపోయాయి. ఆ దరఖాస్తులను పరిశీలించని కారణంగా రైతులు గత ప్రభుత్వం అందించిన రైతుబంధు, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాల ద్వారా అందే సాయాన్ని కోల్పోవడంతో పాటు రైతుబీమాకు నోచుకోకుండా పోయారు. బ్యాంకుల ద్వారా వడ్డీ లేని పంట రుణాలతో పాటు ఇత రత్రా రుణాలను పొందలేక పోయారు.

### ఆర్వోఆర్-24తో పెరగనున్న పారదర్శకత

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న ఆర్వోఆర్-24 రెవెన్యూ చట్టం ప్రకారం రెవెన్యూ సేవలలో మరింత పారదర్శకత పెరుగనున్నది. ఈ కొత్త చట్టంతో కలెక్టర్‌తో నిమిత్తం లేకుండా తహసీల్దార్లు, ఆర్డీవోలకే బదలాయింపులు కేటాయించనున్నారు. ముఖ్యంగా మ్యుటేషన్, చట్టబద్ద హక్కుల నమోదు, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం, భూ రికార్డుల సవరణ, సాదాబైనామా, ఆక్యుపెన్సీ రైట్ సర్టిఫికెట్ దరఖాస్తులకు సంబంధించిన అంశాలను ఆర్డీవోలకు అప్పగించనుండగా, విరాసత్‌తో పాటు మరికొన్ని అంశాలను తహసీల్దార్లకు అప్పగించనున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్న సివిల్ కోర్టుకు వెళ్లాల్సి ఉండగా, ప్రస్తుతం తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే సమస్యల పరిష్కారం చేసుకునే అవకాశం కలుగనుంది.

**ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం : గొరిగె సోమయ్య, కోడూరు**



కాస్తులో ఉన్నప్పటికి పట్టాదారు పాస్ పుస్తకం లేకపోవడంతో ప్రభుత్వం నుంచి లబించే ప్రయోజనాలు మాకు అందకుండా పోయాయి. సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభాపరిణామం. మా పదేళ్ల నిరీక్షణకు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ' భూభారతి ' బిల్లు ద్వారా తెరపడడం చాలా సంతోషకరమైన విషయం.

**దరఖాస్తు చేసుకున్న వారందరికీ చేకూరనున్న ప్రయోజనం : పిన్నింటి మల్లయ్య, దాసన్నగూడెం**



రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సాదాబైనామాలో దరఖాస్తు చేసుకున్న రైతులందరికి ప్రయోజనం చేకూరనుంది. పదేళ్ల నుంచి భూములను కాస్తు చేసుకుంటున్నప్పటికీ పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి లభించే ప్రయోజనాలు అందలేదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అందని ద్రాక్షగా ఉన్న ప్రభుత్వం నుంచి లభించే ప్రయోజనాలు సాదాబైనామా దరఖాస్తుదారులకు అందుబాటులోకి రావడం పట్ల ఎంతో ఆనందంగా ఉంది.

# ఎస్సీ వర్గీకరణ వినతులపై నివేదిక అందజేస్తాం..

- ఎస్సీ ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్
- హనుమకొండ కలెక్టరేట్‌లో విచారణ
- ఎస్సీ కుల సంఘాల నుంచి 135 వినతులు స్వీకరణ

6




మాట్లాడుతున్న డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్

# సంక్రాంతికి ఘన్‌పూర్ మున్సిపాలిటీగా ప్రకటన

- సీఎం పదవి ఒక్కటే చేయలేదు.. నాకు ఆశ లేదు
- ఇందిరకు నాకు మధ్య ఎలాంటి విభేదాలు లేవు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేను చేయని పదవులు లేవు, డిప్యూటీ సీఎంగా ఎదిగాను, నాలుగైదు శాఖలకు మంత్రిగా పని చేశాను, మీ ఆశీర్వాదంతో డిప్యూటీ సీఎంగా చేశాను. మిగిలింది ఒక్క సీఎం పదవి మాత్రమేనని.. నాకు ఆ ఆశ కూడలేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు 30 ఏళ్లపాటు తనను నిండుమనసుతో ఆశీర్వదించి రాజకీయ బిక్షపెట్టారన్నారు. తనను 15 ఏళ్ల తరువాత ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోలే నిదన్నారు. సింగపురం ఇందిరకు తనకు మధ్య ఎలాంటి వర్గ విభేదాలు లేవన్నారు. ఇందిరను సీఎం వద్దకు తీసుకువెళ్లి రాష్ట్ర స్థాయిలో పదవి ఇవ్వాలని సీఎంను తాను కోరానని తెలిపారు. ప్రొటోకాల్ లేకుండా ఎలా రావాలనే ఇందిరా రావడం లేదనే విషయం తెలిసిందన్నారు. వచ్చే సంక్రాంతికి ఘన్‌పూర్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రకటన వస్తుందన్నారు. మున్సిపాలిటీగా ప్రకటన రావడంతో పాటు అభివృద్ధికి రూ.25కోట్ల నిధులు తీసుకువస్తానని తెలిపారు. 2026 మే వరకు ఘన్‌పూర్ నియోజకవర్గ రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో 500 మందిసీటింగ్ కెపాసిటీతో టౌన్‌హాల్ నిర్మిస్తానని, విద్యార్థులు, యువతకు అనుకూలంగా ఉండేలా ఇంటర్నెట్, వైఫై సౌకార్యలతో లైబ్రరీని ఏర్పాటుచేస్తానని ప్రకటించారు. ఇప్పటికే నియోజకవర్గానికి రూ 750 కోట్ల నిధులు తీసుకువచ్చానని త్వరలోనే సీఎం చేతుల మీదుగా అన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయిస్తానని తెలిపారు. పార్టీ రాష్ట్ర నాయకుడు సీహెచ్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గన్ను నర్సింహులు, నాగరబోయిన శ్రీరాములు, రాపోలు మధుసూదన్ రెడ్డి, బూర్ల శంకర్, కొలిపాక సతీష్, నీల గట్టయ్య, నీల సోమన్న, గాండ్ల రాజు, నీల శ్రీధర్, ఐలయ్య, నర్సింహులు, గట్టు ఎల్లయ్యగౌడ్, గట్టు కోటేశ్వర్, గట్టు చేరాలు, చింత ఎల్లయ్య, సింగపురం వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



# అమిత్ షా వ్యాఖ్యలపై కన్నెర్ర



అమిత్ షా ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేసి మోదీ, అమిత్‌షాల ఫ్లెక్సీలను దహనం చేసి అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు


» మిగతా 8వ పేజీలో...


# శిశు మరణాల రేటు తగ్గించాలి

**డీఎంహెచ్‌వో మల్లికార్జునరావు**

జనగామ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తూ శిశు మరణాలను తగ్గించాలని జనగామ డీఎంహెచ్‌వో మల్లికార్జునరావు అన్నారు. శిశు మరణాలపై గురువారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణ అధ్యక్షతన జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశు మరణాలు జరుగకుండా ఆశా వర్కర్ల నుంచి హాస్పిటల్ స్థాయిలో ప్రతి ఒక్కరు బాధ్యతగా నిర్వహించినట్లయితే శిశు మరణాలు తగ్గించవచ్చన్నారు. గర్భిణీలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్లు స్వర్ణ కుమారి, శ్రీదేవి పాల్గొన్నారు.

## గుండ్రాతిమడుగు ఏఈవో సస్పెన్షన్

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు రైతులను తప్పుదోవ పట్టించి, వారి అకౌంట్లో పడిన రైతుబీమా నిధులను ఆ తర్వాత తన అకౌంట్‌లోకి మళ్లించుకున్నందుకు కురవి మండలం గుండ్రాతిమడుగు క్లస్టర్‌కు చెందిన ఏఈవో కల్యాణ్‌ను వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి గురువారం ఉదయం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఈవో సస్పెన్షన్ అయిన విషయాన్ని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల ధ్రువీకరించారు. గుండ్రాతిమడుగు, గేటు తండాల్లోని రైతులు షైబుకు చెందిన రూ.1.50 లక్షలు, ఇరానీకి చెందిన రూ.5 లక్షలు, వెంకటమ్మకు చెందిన రూ.5 లక్షలను రైతుబంధు నిధులు పడగా, వారి ఖాతాల్లో నుంచి కల్యాణ్ తన అకౌంట్‌లోకి మళ్లించుకున్నారు. దీంతో ఆ మహిళ రైతు రైతుబీమా నిధులను తన అకౌంట్‌లోకి మళ్లించుకున్నాడని ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 17న కురవి వ్యవసాయాధికారి నర్సింహారావు, మరిపెడ ఏడీఏ విజయచంద్రలు గేట్‌తండాలో విచారణ జరిపి, నిధులు దారి మళ్లినట్లు జిల్లా వ్యవసాయాధికారిణికి నివేదించారు. దీంతో జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు ఈ విషయంపై నివేదించి, చర్చించిన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు నివేదించారు. దీంతో కమిషనర్ ఏఈవో కల్యాణ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఇనుగుర్తి మండలం పేరిట తొలి 'ఎస్‌హెచ్‌జీ' ప్రారంభం



ఇనుగుర్తి ఐవోబీలో కొత్త ఖాతాను ప్రారంభిస్తున్న రాంలాల్‌తండా ఎస్‌హెచ్‌జీ మహిళలు

ఇనుగుర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన ఇనుగుర్తి మండలంలో తొలి స్వయం సహాయక సంఘం(ఎస్‌హెచ్‌జీ) ఏర్పాటైంది. కోమటిపల్లి శివారు తారసింగ్‌తండా జీపీ రాంలాల్‌తండాకి చెందిన ధరణి గ్రామైక్య సంఘం పరిధిలో వీరభద్ర స్వయం సహాయక సంఘం నూతనంగా ఏర్పాటైంది. ఈ మేరకు ఇనుగుర్తిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో గురువారం ఆ సంఘం ఖాతాను ప్రారంభించినట్లు సంఘం అధ్యక్షురాలు బి.సుభ్రద, కార్యదర్శి ఎస్.సాలి తెలిపారు. మండల పరిధిలోని మిగతా గ్రామాల్లోని సంఘాలు తమ బ్యాంకులో ఖాతా తెరిస్తే రూ.10లక్షల రుణం ఇవ్వనున్నట్లు మేనేజర్ కె.రమేష్, అసిస్టెంట్ మేనేజర్ బి.రవీందర్ తెలిపారు. కాగా, మండలంలో తొలి స్వయం సహాయక సంఘం ఖాతా ఏర్పాటుతో త్వరలోనే ఐకేపీ ఇనుగుర్తిశాఖ సైతం ఏర్పాటు కానున్నట్లు గ్రామైక్య సంఘాల్లోని మహిళలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పెండింగ్ కేసులు లేకుండా పరిష్కరించాలి

▸▸ తొర్రూరు డీఎస్పీ కృష్ణప్రసాద్



సీరోలు పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ నిర్వహిస్తున్న కృష్ణప్రసాద్

సీరోలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులు లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని తొర్రూరు డీఎస్పీ కె.కృష్ణప్రసాద్ సూచించారు. సీరోలు పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ నిర్వహణకు ఉపయోగిస్తున్న పలు రికార్డులు, యూనిఫాం, ఆయుధాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదులు చేసేందుకు వచ్చే వారితో స్నేహపూర్వకంగా మాట్లాడి సమస్యను తెలుసుకోవాలన్నారు. పెండింగ్ కేసులు లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని విధులు నిర్వహించాలని ఎస్సై నగేష్‌కు సూచించారు. డీఎస్పీ వెంట మరిపెడ సీఐ రాజ్‌కుమార్ ఉన్నారు.

## నాలుగు రోజులు బ్యాంకు సేవల నిలిపివేత

బచ్చన్నపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణవికాస్ బ్యాంకును తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్చేందుకు ఉన్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈనెల 28 నుంచి 31 వరకు నాలుగు రోజులు బ్యాంకుకు సంబంధించిన లావాదేవీలు నిలిపివేస్తున్నట్టు మేనేజర్ గురుప్రీత్‌సింగ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రామీణ బ్యాంకులను అనుసంధానం చేస్తున్న మార్పులో భాగంగానే తెలంగాణాలో ఉన్న 493 ఏపీజీవీబీ శాఖలు, 9 రీజినల్ ఆఫీస్‌లు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం అవుతున్నాయన్నారు. 27లోపు అత్యవసర బ్యాంకింగ్ ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకోవాలని కోరారు. సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ అనుషా, క్యాషియర్స్ పవన్‌కృష్ణ, ఆకాంక్ష పాల్గొన్నారు.

## 'దేవాదుల' కాలువల భూసేకరణకు నిధులివ్వాలి

▸▸ అసెంబ్లీలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ప్రాజెక్టులో కాలువల నిర్మాణానికి సంబంధించిన భూసేకరణకు నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. దేవాదుల ప్రాజెక్టు ప్యాకేజీ-8, ప్యాకేజీ-7లో 499 ఎకరాల భూమిని సేకరిస్తే కాలువల నిర్మాణం పూర్తి చేసుకునే అవకాశం ఉందని అన్నారు. కాలువల నిర్మాణం పూర్తయితే జనగామతో పాటు పక్కనే ఉన్న ఆలేరు నియోజకవర్గానికి కూడా నీరందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. భూసేకరణ కోసం రూ.178 కోట్లను మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని గతంలో జరిగిన రివ్యూ సందర్భంగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి కూడా తాను తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు. జనగామ నియోజకవర్గంలోని చెరువులు నిండనప్పటికీ ఆలేరుకు తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తరలించుకుపోతున్నారని అన్నారు. భూసేకరణ కోసం రూ.178 కోట్లు మంజూరు చేస్తే ఎలాంటి సమస్య లేకుండా జనగామ, ఆలేరు నియోజకవర్గాలకు నీరందుతుందని అన్నారు. దేవాదుల ద్వారా చెరువులు నింపేందుకు అవకాశం ఉన్నప్పటికీ అధికారులు పంపులను సరిగ్గా ఆన్ చేయడం లేదని, పంపులన్నింటినీ ఆన్ చేయడం ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులు పూర్తిగా నింపుకోవచ్చని అన్నారు.

## మరోసారి సీఎంను కలిసిన ప్రభుత్వ విప్



సీఎంకు అభివృద్ధి పనుల నివేదిక అందజేస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మరిపెడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ గురువారం రాష్ట్ర అసెంబ్లీలోని ఆయన చాంబర్లో మరోసారి మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం రాత్రి డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నేత ఆర్.సురేందర్‌రెడ్డితో సీఎంను కలిసిన విషయం ఈ ప్రాంత ప్రజలకు తెలిసిందే. డోర్నకల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని వివిధ అభివృద్ధి పనుల వివరాలు, ఆ పనుల మంజూరి ఆవశ్యతపై సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తి వివరాలతో కూడిన నివేదికను రాంచంద్రునాయక్ సమర్పించారు. ముఖ్యమంత్రి సైతం సానుకూలంగా స్పందించి భరోసా ఇచ్చినట్లు తెలిసింది.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

▸▸ జేఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అక్రమ అరెస్టులతో వర్గీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని ఆపలేరని జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరును నిరసిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో గురువారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా మహబూబాబాద్‌లో తెల్లవారు జామున పిల్లి సుధాకర్‌తో పాటు నాయకులు దార కుమార్, పిల్లి రవి, దార సాత్విక్‌లను టౌన్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ...రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణపై రేవంత్‌రెడ్డి ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ వ్యతిరేక పనులకు శ్రీకారం చుడితే ప్రజాక్షేత్రంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.



టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టు అయిన పిల్లి సుధాకర్, నేతలు

## డివైడర్, లైటింగ్ ఏర్పాటు చేయాలి



మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మానుకోట పట్టణంలోని నెహ్రూసెంటర్ నుంచి మంగళికాలనీ వరకు డివైడర్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో సీపీఎంఆధ్వర్యంలో డీఈ ఉపేందర్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూసెంటర్ నుంచి రజాల్‌పేట వరకు రోడ్డు వెడల్పులో భాగంగా పేదలు, మధ్యతరగతి ప్రజలు తమ ఇళ్లను కోల్పోయారనిచెప్పారు. తమకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ వస్తుందని ఆశపడ్డ ప్రజలకు నిరాశ ఎదురైందని తెలిపారు. నెహ్రూసెంటర్ నుంచి బాబునాయక్ తండా క్రాస్‌రోడ్ వరకు మాత్రమే డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పడం శోచనీయమన్నారు. దానిని మంగళి కాలనీ వరకు పొడగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమ్మెట రాజమౌళి, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, నక్క సైదులు, ఎర్ర శ్రీనివాస్, ఎస్కే. తజ్జు, ఎమ్డీ. రజాక్, లాలయ్య, వెంకన్న, మందుల మహేందర్ పాల్గొన్నారు.

## సీపీఐ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

• మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి



సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

మహబూబాబాద్‌టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వార్షికోత్సవాలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ వీరభవన్‌లో గురువారం సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని పెరుగుకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భం గా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 99 సంవత్సరాలు పూర్తయిందని, నాటి నుంచి నేటి వరకు పేదల పక్షాన ఉద్యమాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 26న పెద్దఎత్తున సీపీఐ జెండాలు ఎగురవేయాలన్నారు. అదేవిధంగా నల్లగొండలో డిసెంబరు 30న లక్ష మందితో జరుపతలపెట్టిన 100వ శాతాబ్ది వేడుకల ప్రారంభోత్సవ వేడుకల బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సభకు జాతీయ కార్యదర్శి డి.రాజా హాజరవుతున్నారని చెప్పారు. సమావేశంలో తమ్మెర విశ్వేశ్వరరావు, బి.అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, రేషపల్లి నవీన్, వెంకన్న, పాండురంగాచారి, సాంబలక్ష్మి, నాగేశ్వర్‌రావు, శేఖర్, రాజన్న, శ్రీనాథ్, స్వామి, రమేష్, రవీందర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి బ్రెయిన్‌డెడ్

• అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు



కన్నయ్య (ఫైల్)

చిలుపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తలకు తీవ్ర గాయం కావడంతో బ్రెయిన్ డెడ్ అయింది. ఐదు రోజులుగా మెరుగైన వైద్యం అందించినప్పటికీ కదలిక లేకపోవడంతో చేసేదేమీలేక అతడి కుటుంబ సభ్యులు అవయవాలను దానం చేసి ఉదారతను చాటుకున్నారు. ఈ ఘటన జనగామ జిల్లా చిలుపూరు మండలంలోని వంగాలపల్లిలో గురువారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఆవుల కన్నయ్య (37) తనకున్న కొద్దిపాటి వ్యవసాయంతో పాటు, డెయిరీ నిర్వహిస్తున్నాడు. కాగా, అతడు నిత్యం పాలు విక్రయించేందుకు హనుమకొండకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 15న (ఆదివారం) తన బైక్‌పై పాల క్యాన్లతో హన్మకొండకు వెళ్తున్నాడు. నిట్ కళాశాల దగ్గర యూటర్న్ చేస్తుండగా హనుమకొండ నుంచి కాజీపేట వైపు వేగంగా వెళ్తున్న ఓ యువకుడు బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కన్నయ్యను స్థానికులు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ అయినట్లు గుర్తించిన అక్కడి వైద్యులు పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్ళాలని కుటుంబ సభ్యులకు సూచించారు. దీంతో వారు కన్నయ్యను సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. చికిత్స ప్రారంభించి రెండు రోజులైనా అతనిలో కదలికలు లేకపోవడంతో అక్కడి వైద్యులు చేతులెత్తేశారు. దీంతో కుటుంబ సభ్యులు అవయవదానం చేసి ఆదర్శంగా నిలిచారు. కన్నయ్య అకాల మృతితో వంగాలపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఉరివేసుకుని యువతి ఆత్మహత్య



లావణ్య మృతదేహం

పెద్దవంగర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చిట్యాల గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... చిట్యాల గ్రామానికి చెందిన ఈదురు యాకయ్య- సోమలక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో మొదటి కుమార్తె ఈదురు లావణ్య(25) డిగ్రీ పూర్తి చేసింది. ఇటీవల తల్లిదండ్రులు ఓ వ్యక్తితో నిశ్చితార్థం నిర్వహించారు. ఏమైందో ఏమోగాని ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు వచ్చిచూసే సరికి అప్పటికే మృతి చెంది విగతజీవిగా ఉంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. వివాహం జరగాల్సిన ఇంట్లో విషాదం చోటు చేసుకోవడంతో తల్లిదండ్రులు, బంధవులు కన్నీరు మున్నీరయ్యారు.

## కేజ్‌వీల్స్ తగిలి వ్యక్తి మృతి

బచ్చన్నపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేజీవీల్స్‌తో వెళుతున్న ట్రాక్టర్ తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన బచ్చన్నపేట మండలంలోని చిన్నరామన్‌చర్ల రహదారిపై గోపాల్ నగర్ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎస్‌కే హమీద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నక్కవానిగూడెం గ్రామానికి చెందిన గుంటిపల్లి యాదగిరి (52) వ్యక్తిగత పనులపై చిన్నరామన్‌చర్ల వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. బచ్చన్నపేటకు చెందిన శివరాత్రి వెంకటేశ్ అనే వ్యక్తి ట్రాక్టర్‌కు కేజీవీల్స్ వేసుకుని అజాగ్రత్తగా నడుపుతూ వస్తుండగా అవి తగిలి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.

కాగా, ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్‌కే హమీద్ తెలిపారు.

## టీచర్లు లేక ఆగిన ఎఫ్ఏ-3 పరీక్షలు

కన్నాయిగూడెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు లేక షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన ఎఫ్ఏ-3 పరీక్షలు నిలిచిపోయిన ఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో జరిగింది. ముప్పనపల్లి కేజీబీవీ పాఠశాలలో ఈనెల 17 నుంచి ఎఫ్ఏ 3 పరీక్షలు జరగాల్సి ఉండగా టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్‌స్టాఫ్ అందరూ గైర్హాజరయ్యారు. తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ పదిరోజులుగా జిల్లా కేంద్రంలో వారు సమ్మె చేస్తున్నారు. ఇందులో ముప్పనపల్లి పాఠశాల ఉపాధ్యాయులతో పాటుగా ఇతర సిబ్బంది కూడా పాల్గొంటున్నారు. టీచర్స్ అందుబాటులో లేకపోవడంతో పది రోజులుగా పాఠాలు జరగడం లేదు. ఈ పాఠశాలలో టీచింగ్ స్టాఫ్ తొమ్మిది మంది, నాన్ టీచింగ్ స్టాఫ్ పది మంది ఉన్నారు. ఇందులో వంట మనుషులు, వాచ్‌మెన్‌తో పాటుగా ఒక టీచర్ మాత్రం పిల్లలకు కాపలాగా ఉంటున్నారు. మిగతా సిబ్బంది అందరూ సమ్మెలో పాల్గొంటున్నారు. ఇప్పటికే పది రోజులుగా పాఠ్యాంశాలు బోధన లేకపోవడం, ఎఫ్ఏ- 3 పరీక్షలు నిర్వహించలేదు. ఇదిలా ఉండగా జనవరి మొదటి వారంలో జరిగే ఎస్ఏ- 2 పరీక్షలకు సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కాగా, గురువారం పదో తరగతి పరీక్ష షెడ్యూల్ కూడా విడుదల కావడంతో మార్చిలో జరిగే పది పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాల్సిన ఉపాధ్యాయులు సమ్మెలో ఉండటంతో విద్యార్థులు సైతం ఆందోళన చెందుతున్నారు.



గోదావరిలో వీఐపీ ఘాట్ వద్ద చెత్తాచెదారం

## నిర్లక్ష్యానికి నిదర్శనం

▸▸ కాళేశ్వరంలో లోపించిన పారిశుధ్యం

మహదేవపూర్‌రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర త్రివేణి సంగమం వద్ద పారిశుధ్యం లోపించింది. ప్రధాన ఘాట్‌తో పాటు వీఐపీ ఘాట్ చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఎక్కడ చూసిన పాతబట్టలు, కుండలు, వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయి. దీంతోపాటు బస్టాండ్ నుంచి పుష్కరఘాట్‌కు వెళ్లే మార్గంలోనూ ఉదయం వేళల్లో నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఎంతో పవిత్రంగా ఆ పరమ శివుడిని దర్శించుకోవాలని వచ్చిన అంతా ఆపవిత్రంగానే వెళ్లాల్సి వస్తోందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు దీనిపై దృష్టి సారించకపోవడంతో పలు మార్గాల్లోనూ చెత్తాచెదారంతో నిండిపోతోందని భక్తులు, గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకుని వీఐపీ, సాధారణ ఘాట్లను శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పుణ్యక్షేత్రం ఇట్లుంటే భక్తులెట్లా వస్తారనే ఆందోళన స్థానికుల్లో నెలకొంది.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి

▸▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి

పాలకుర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పథకాలను పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శివం గార్డెన్‌లో గురువారం మండల స్థాయి శక్తి కేంద్రం ఇన్‌చార్జిల సమావేశం జరుగగా ముఖ్య అతిథిగా దశమంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో గత ఎన్నికల కోసం చేపట్టిన బీజేపీ సభ్యత్వం లక్ష వరకు నమోదయిందన్నారు. బీజేపీని నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్మాణం కోసం పార్టీ కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వం గణనీయంగా పెరిగిందన్నారు. వచ్చే నాలుగేళ్లలో బీజేపీ నెంబర్ వన్ స్థానంలో ఉండేలా ప్రతీ కార్యకర్తలా పని చేయాలని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యదిక స్థానాలను గెలుచుకుంటుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, మండల అధ్యక్షుడు దుంపల సంపత్, కమ్మగాని శ్రీకాంత్, మారం రవి, వేల్పుల దేవరాజ్, కడుదల నిరంజన్‌రెడ్డి, పెనుగొండ సోమేశ్వర్, రామారావు ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణ వినతులపై నివేదిక అందజేస్తాం

▸▸ ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్



కమిషన్‌కు ఇచ్చిన వినతిపత్రాన్ని చూపిస్తున్న పంబాల కులవృత్తి కళాకారుల సంఘం నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం నిర్వహించిన బహిరంగ విచారణలో తమ దృష్టికి వచ్చిన అభ్యర్థనలు, విన్నపాలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు. రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో షెడ్యూల్డ్ కులాల్లో వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని బహిరంగ విచారణ నిర్వహించారు. వర్గీకరణపై ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ ఎస్సీ కుల సంఘాలు ఇచ్చిన దరఖాస్తులను ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వివిధ ఎస్సీ కుల సంఘాల నుంచి 135 వినతులు, అభ్యర్థనలు వచ్చాయన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన న్యాయపరమైన అంశాలు, ఉద్యోగ, సామాజిక పరిస్థితులు, చరిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్నిప్రాంతాల కుల సంఘాల అభ్యర్థనలు, వినతులు సేకరించి ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందజేసి న్యాయం చేస్తామన్నారు.

### స్వాగతం పలికిన ఇన్‌చార్జి కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్న ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఘనంగా సన్మానించారు. వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల నుంచి ఎస్సీ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ నాయకులు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర, ఉమ్మడి జిల్లా కమిటీ నాయకులు, ధర్మసమాజ్ పార్టీ నాయకులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎస్సీ వర్గీకరణ చేయాలని వినతులు అందజేశారు. జాతీయ మాల మహానాడు నాయకులు ఎస్సీ వర్గీకరణ చేయొద్దని వినతిపత్రం అందజేశారు. అదే విధంగా అత్యంత వెనుకబడిన పంబాల కులాన్ని ఎస్సీ ఏ గ్రూపులో చేర్చి జనాభా ప్రాతిపదికన కాకుండావ వెనుకబాటు ప్రాతిపదికన ఎక్కువ రిజర్వేషన్ కల్పించాలని పంబాల కులవృత్తి కళాకారుల సంఘం నాయకులు కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, వరంగల్ ఉమ్మడి జిల్లా డీఎస్సీ డీఓ, ఎస్‌డబ్ల్యూఓలు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఈవీ శ్రీనివాస్‌రావు, జిల్లా అధికారులు, ఎస్సీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు (బిల్టీ రకం) | - | - |
| పల్లికాయ (సూక) | 6012 | 3000 |
| పల్లికాయ (పచ్చిది) | 5200 | 4500 |
| కందులు | - | - |
| పెసళ్లు | 5212 | 4000 |
| పత్తి | 7020 | 5800 |
| పసుపు (కాడి) | 10469 | 9823 |
| పసుపు (గోల) | 10336 | 9834 |
| తేజ మిర్చి | 12000 | 9000 |
| తేజ మిర్చి (కొత్తది) | 16100 | 12000 |
| తేజ ఏసీ | 15500 | 14000 |
| వండర్‌హాట్ ఏసీ | 14000 | 13000 |
| యూఎస్341ఏసీ | 15000 | 11000 |
| దేశీ ఏసీ | - | - |
| సింగిల్‌పట్టి ఏసీ | - | - |
| తాలు మిర్చి | 7000 | 3000 |

- వరంగల్ వ్యవసాయం

### ఆన్‌లైన్ మోసాలపై 1930ను సంప్రదించాలి

ఆన్‌లైన్ ద్వారా చేసే ప్రతీ పనిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మన పని మనం చేసుకుంటుండగానే మోసపూరితమైన లింక్‌లు, మెసేజ్‌లు వస్తుంటాయి వాటి జోలికి వెళ్లకూడదు. మోసం జరిగినట్లు గ్రహిస్తే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేకంగా సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ పని చేస్తోంది. ఫిర్యాదుల ద్వారా చాలామందిని కాపాడగలిగాం. ఏ ఒక్కరూ ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, లోన్ యాప్‌లు, ఒకటికి రెండింతలు డబ్బులు ఇస్తామనే మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దు. ముఖ్యంగా పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వొద్దు.

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్



# జీవితాలతో సెల్‌గాటం!

## ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్న అమాయకులు

### బయట పడలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న వైనం
### అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

వరంగల్ క్రైం, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక రంగంలో అనేక మార్పులు వస్తున్నాయి. దానిని సరిగ్గా వినియోగించుకునే వారు లక్షలో వేతనాలు పొంది విలాసవంతంగా జీవిస్తుంటే.. దానిని దుర్వినియోగం చేసుకునే వారి జీవితాలు రోడ్డున పడుతున్నాయి. తద్వారా వచ్చే మానసిక ఒత్తిళ్లను తట్టుకోలేక బలవన్మరణం పొందుతూ కుటుంబాలకు శోకం మిగుల్చుతున్నారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు ఆన్‌లైన్ వేదికగా ఒకటికి రెండింతలు డబ్బులు ఇస్తామని ప్రసారమయ్యే మోసపూరిత ప్రకటనలను ఆకర్షితులై చట్టబద్ధత కానీ యాప్‌లు, లింక్‌ల ద్వారా డబ్బులు పెట్టి చివరికి మోసపోయామని లబోదిబోమంటున్నారు. మరికొంతమంది లోన్‌యాప్‌ల ద్వారా రుణాలు పొంది వాటిని ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లపై పెట్టుబడిగా పెట్టి ఆ తర్వాత డబ్బులు కోల్పోయి రోడ్డున పడుతున్నారు. ఆ నష్టాన్ని పూడ్చలేక అడ్డదారులు తొక్కి చివరికి ఆ సమస్య నుంచి బయటపడలేక మానసిక ఒత్తిళ్లతో అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు.

#### ఆశ చూపి వలలోకి..

సైబర్ దొంగలు వివిధ మార్గాల్లో ప్రజలను తమ వలలోకి దింపి జేబులు లూటీ చేస్తున్నారు. ఉద్యోగం, ఇన్వెస్ట్‌మెంట్, కొరియర్ పేరిట ముందుగా ఆకర్షించి ఆ తర్వాత నట్టేట ముంచుతున్నారు. ఆన్‌లైన్‌లోని మోసాలకు ఎలాంటి తారతమ్యం లేకుండా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, చిరు వ్యాపారాలు, గృహిణులు, చిన్నా, పెద్ద తేడా అందరూ ఆకర్షితులై డబ్బులు సమర్పించుకుంటున్నారు. రుణయాప్ ద్వారా లోన్ తీసుకున్న వారు తిరిగి చెల్లించలేక, నిర్వాహకులు పెట్టే వేధింపులు భరించలేక కొంతమంది ప్రాణాలు తీసుకుంటున్నారు. లోన్ యాప్ నిర్వాహకుల నుంచి రుణం పొందితే సకాలంలో డబ్బులు తిరిగి చెల్లించకున్నా.. ఆలస్యం చేసినా.. రుణగ్రహీతలు ఫొటోలను మార్ఫింగ్ చేసి వారి బంధువులకు, ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్‌కు పంపిస్తున్నారు. అలాంటి సమయంలో రుణ గ్రహీతలు అవమాన భారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

#### అత్యాశకుపోయి.. ఉన్నది పోగొట్టుకుని..

ఈ మధ్యకాలంలో వాట్సాప్‌కు వచ్చే లింక్ మెసేజ్‌లను నొక్కి అటు నుంచి గుర్తుతెలియని వ్యక్తి డబ్బులు వస్తాయనే ఆశ చూపగానే విడతల వారీగా డబ్బులను పంపించి నష్టపోతున్నారు. ఈ రకమైన మోసాల బాధితులే అత్యధికంగా పోలీసులు ఆశ్రయిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుల్లో రోజుకు ఒకటి, రెండైనా ఇలాంటివి ఉంటున్నాయి. మీరు పెట్టే డబ్బులు రెట్టింపు అవుతాయనగానే ఆలోచించకుండా డబ్బులు వేసి ఆ తర్వాత లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌కు పరిగెత్తుకుంటూ వెళుతున్నారు.

#### సైబర్ క్రైం కేసులు

వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఉన్న సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌తో పాటు మూడు జోన్‌లలో ఉన్న ఆయా పోలీస్‌స్టేషన్‌లలో సైబర్ క్రైంకు గురైన బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో 142 కేసులు నమోదు కాగా, కమిషనరేట్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో 173 కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ నుంచి సమారు రూ.32 లక్షలకు పైగా బాధితులకు ఇప్పించగా, పోలీస్‌స్టేషన్ల నుంచి రూ.కోటి 30 లక్షల వరకు రీఫండ్ చేయించగలిగారు.

### యాప్ మోసాలకు బలి..

- ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా రూ.1,60,000 కోల్పోయిన శాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజుపల్లికి చెందిన అవుల దిలీప్.. పురుగుల మందు తాగి ఈ ఏడాది మే 31న ఆత్మహత్య చేసుకున్నాడు.
- లోన్ యాప్ నిర్వాహకుల వేధింపుల కారణంగా ఈ ఏడాది ఆగస్టు 31న మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కరీమాబాద్ జన్మభూమి జంక్షన్ ప్రాంతానికి చెందిన విద్యార్థి కంభంపాటి విష్ణువర్ధన్ చీరతో ఉరి వేసుకొని బలవన్మరణం పొందాడు.
- భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగకు చెందిన రేషన్ డీలర్ గొడిశాల పైడయ్య ఇంటి నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో రుణం తీసుకొని ఈఎంఐ చెల్లించలేదు. లోన్ యాప్ నిర్వాహకులు ఒత్తిడి పెంచడంతో ఈ ఏడాది జూన్ 27న రేషన్‌షాపులోనే ఉరి వేసుకొని మరణించాడు.
- వర్ధన్నపేట కడారిగూడెంకు చెందిన బీటెక్ విద్యార్థి బత్తిని గణేశ్ ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం స్నేహితుల వద్ద అప్పు చేసి తీర్చలేక ఈ ఏడాది అక్టోబర్ 23న పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ 29న హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో మరణించాడు.
- డిసెంబర్ 16న వర్ధన్నపేట మండలం బండతౌపురానికి చెందిన మరుపట్ల హనూక్ (26) ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ.6లక్షలు పోగొట్టుకొని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.





### అడ్డదారులు తొక్కి కటకటాల్లోకి..

బెట్టింగ్‌లు, గేమింగ్‌లు, వ్యక్తిగత అవసరాల కోసం ఆన్‌లైన్ లోన్‌యాప్‌లు ఆశ్రయించి రుణాలు తీసుకొని వాటిని తీర్చలేక కొందరు అడ్డదారులు తొక్కుతూ చివరికి చోరీలకు పాల్పడుతున్నారు. దీనిలో భాగంగా వరంగల్ జిల్లా రాయపర్తి మండలానికి చెందిన కొండపల్లి ధర్మారాజు.. బిర్యానీ సెంటర్ నడిపి నష్టపోయాడు. అనంతరం హనుమకొండ రెవెన్యూకాలనీకి మకాం మార్చి అద్దె ఇంట్లో ఉన్నాడు. నష్టపోయిన డబ్బును తిరిగి పొందేందుకు ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా సంపాదించాలని ప్లాన్ వేశాడు. వాటి ద్వారా ఇంకా నష్టపోయాడు. దీంతో దొంగగా మారి చోరీలు చేయడం ప్రారంభించాడు. ఇలా 13 చోరీలు చేసి చివరికి కేయూ పోలీసులకు చిక్కి జైలులో ఊచలు లెక్కపెడుతున్నాడు.



అలర్ట్

# లింకు నొక్కారో.. కాసులు కల్లాస్!

## రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- అవగాహన లేక కొందరు.. ఆశతో మరికొందరు
- ఇప్పటికే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న వాళ్లు కోకొల్లలు
- స్వీయ జాగ్రత్తలతోనే సైబర్ నేరాల నియంత్రణ

లింగాలఘణపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మీ బ్యాంకు అకౌంట్ బ్లాక్ అయింది. మీ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది చెప్పండి అంటూ బ్యాంకు అధికారుల పేరుతో తెలియని వ్యక్తులు కాల్ చేస్తుంటారు. మరికొందరికేమో ఏమీరు లక్కీ డ్రాకు ఎంపికయ్యారు.. మేమడిగే అతి సులభమైన రెండు ప్రశ్నలకు సమాధానం చెప్పండి.. ఆతర్వాత మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీ చెప్పండి.. క్షణాల్లో ఇక లక్కీ డ్రా డబ్బులు మీ సొంతల్ అంటూ బురిడీ కొట్టిస్తారు. ఇటీవల ఇలాంటి ఫేక్ కాల్స్ ఎక్కువయ్యాయి. పొరపాటున వారి మాటలు నమ్మి ఓటీపీలు చెప్పారో.. నిజంగానే బ్యాంకులో ఉన్న మీ కాసులు కల్లాస్ అవ్వాల్సిందే. ఏం జరిగిందో తెల్సుకుని తేరుకునేలోపే సైబర్ నేరగాళ్లు మన ఖాతాల్లో డబ్బులను మాయం చేస్తారు.. సైబర్ నేరగాళ్లు ఇటీవల కాలంలో ఒక అడుగు ముందుకేసి ఖాతాల్లో ఉన్న డబ్బులను మాయం చేయడమే కాకుండా బ్యాంకు ఖాతాలతో లింక్ అయిన మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్‌ను బ్లాక్ చేస్తున్నారు. రోజు రోజుకు సాంకేతిక అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇలాంటి సైబర్ నేరాల తీవ్రత కూడా అంతే స్థాయిలో పెరుగుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. ఓ వైపు పోలీసులు, మరో వైపు స్వచ్ఛంద సంఘాలు సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు ఊరూరా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా రోజుకొక్కటి చొప్పున నేరాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో నిరక్ష్యరాస్యులు పడుతున్నారేమో అనుకుంటే పొరపాటే.. అన్నీ తెలిసిన చదువుకున్న వారే.. వీరిలో బ్యాంకుల ఉద్యోగులు కూడా ఉంటుండటం గమనార్హం.

#### అవగాహన లేక కొందరు.. అత్యాశతో మరికొందరు..


పెరుగుతున్న సాంకేతికత, అందరి చేతిలోకి స్మార్ట్ ఫోన్లు అందుబాటులో రావడం, వాటికి తగ్గట్టుగా తక్కువ ధరలకే ఇంటర్నెట్ సేవలు అందుతుండటంతో ఎటు నుంచి ఏ సైబర్ కేటుగాడు మోసానికి పాల్పడతాడో అర్థం కాని పరిస్థితి. మారుమూల పల్లెలోని చిరుదుకాణాల నుంచి కార్పోరేట్ స్థాయి షాపింగ్‌లు, సూపర్‌మార్కెట్లలో సైతం కొనుగోళ్ల అమ్మకాలకు చెందిన ప్రతీ లావాదేవీని యూపీఐ అకౌంట్ ద్వారా చేస్తున్నారు. అయితే ఆర్థిక లావాదేవీలు చేస్తున్న ప్రతీ యూపీఐ చెల్లింపులన్నీ ప్రైవేటుకు చెందింది కావడంతో మన వ్యక్తిగత సమాచారం మొత్తం వాళ్ల వద్ద ఉండిపోతోంది. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతూ మోసాలకు తెరలేపుతున్నారు. మెసేజ్, వాట్సాప్‌ల ద్వారా తప్పుడు లింకులు షేర్ చేస్తున్నారు. తెలిసీ తెలియక వాటిని నొక్కిన వెంటనే మన ఖాతాల్లోని డబ్బంతా మాయమైపోతోంది. వీటితో పాటుగా కొంతమంది నకిలీ వెబ్‌సైట్లను క్రియేట్ చేస్తుండటంతో స్మార్ట్ ఫోన్లకు వచ్చే బల్క్ వెబ్‌సైట్లలో నకిలీవి ఏవో.. అసలువి ఏవో తెలియక ప్రజలు మోసాలకు గురవుతున్నారు. ఇలాంటి సైబర్ మోసంలో చిక్కుకునే వాళ్లలో కొంతమంది ఏం తెలియని వారుంటుండగా మరికొందరు అత్యాశతో రాత్రికి రాత్రే కోటీశ్వరులుగా ఎదగాలని అత్యాశతో నిండా మునుగుతున్నారు. కొందరు ఆదాయ పన్ను నుంచి తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ మోసాల బారిన పడిపోతున్నారు. ఇంకొంతమంది యువత ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి ఖాతాలను గుల్ల చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ గేముల్లో మొదట గెలిచినట్టు అవకాశం కల్పించి రెట్టింపు డబ్బులు చెల్లించి పూర్తిగా నమ్మించిన తర్వాత ఖాతాలో ఉన్న డబ్బును మొత్తం మాయం చేస్తున్నారు. ఇలాంటి ఘటనే ఇటీవల లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో ఓ యువకుడుపెద్ద మొత్తంలో తన డబ్బును పోగొట్టుకున్నట్టు సమాచారం.



సైబర్ మోసాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నర్మెట సీఐ అబ్బయ్య(ఫైల్)

- జనగామ జిల్లాలో జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు బలై రూ. లక్షల్లో మోసపోయాడు. అదేవిధంగా టీజీఎన్‌పీడీసీఎల్‌లో పనిచేసే ఓ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల మోసానికి రూ. 89వేలు పోగొట్టుకున్నారు. లింగాలఘణపురం మండలానికి చెందిన ఓ గ్రామపంచాయతీ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల కారణంగా తన ఖాతాలోని రూ. 40వేలు మాయం చేసుకున్నాడు.

#### అపరిచితులకు వ్యక్తిగత సమాచారం షేర్ చేయొద్దు



అపరిచిత వ్యక్తులు పంపే లింకులను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దు. అదేవిధంగా ఎవరైనా ఫోన్ చేసి ఆధార్‌నెంబర్, బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఓటీపీ అడిగితే ఎవరికి కూడా షేర్ చేయకూడదు. సైబర్ నేరగాళ్లు మోసం చేసేందుకు అనేక రూపాల్లో స్మార్ట్ ఫోన్‌ద్వారా మోసం చేసేందుకు సిద్ధంగా ఉంటారు. అటువంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలి.

- శ్రీనివాస్‌రెడ్డి, సర్కిల్ ఇన్స్‌పెక్టర్, జనగామ రూరల్



సైబర్ అంబాసిడర్‌గా మహిళలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థిని(ఫైల్)

### సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కకుండా జాగ్రత్తలు ఇలా పాటించాలి..

- సైబర్‌క్రైం జరిగిన వెంటనే / 24 గంటల లోపు 1930కి ఫోన్ కాల్ చేసి సమాచారమివ్వాలి. లేదా cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలి.
- వెబ్‌సైట్‌లు అసలువా లేక నకిలీవా అని తెల్సుకునేందుకు http:///www.getsafeonline.org లో నిర్ధారించుకోవాలి
- మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులు తొందరపడకుండా జాగ్రత్తగా గమనించి ఓపెన్ చేయాలి
- థర్డ్‌పార్టీ అప్లికేషన్లు ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దు



- బహుమతి వచ్చిందని ఎస్ఎంఎస్‌లు వస్తే నమ్మిమోసపోవద్దు
- అపరిచితులకు తమ ఖాతా నెంబర్లు, ఓటీపీలు ఇవ్వకుండా ఉండాలి
- యూపీఐల ద్వారా డబ్బులు చెల్లించే ఖాతాల్లో వీలైనంత మేరకు తక్కువ డబ్బులను ఉంచుకోవడం శ్రేయస్కరం.
- ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్లను ప్రభుత్వం నియమించింది. వారిని సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చు



మొగిలయ్య భౌతిక కాయం



మొగిలయ్య(ఫైల్)

# మూగబోయిన జానపద ఝరి

## 'బలగం' మొగిలయ్య కన్నుమూత

- అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస
- పలువురి నివాళి.. ముగిసిన అంత్యక్రియలు

దుగ్గొండి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ జానపద కళాకారుడు, 'బలగం' ఫేమ్ పస్తం మొగిలయ్య (67) కన్నుమూశారు. రెండేళ్లుగా రెండు మూత్రపిండాలు ఫెయిలై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. కాగా, మొగిలయ్య స్వస్థలంలో మొగిలయ్య భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించి రూ.50వేలు మొగిలయ్య భార్య కొమురమ్మకు అందించారు. అదేవిధంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు టీపీసీసీ కార్యదర్శి బొమ్మెనపెల్లి అశోక్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించి రూ.50 వేలు ఆర్థికసాయం చేశారు. బలగం సినిమాలో నటించిన రచ్చ రవి, బాలు సందర్శించి నివాళులర్పించారు. తెలంగాణ సాంస్కృతిక కళాబృందం సభ్యులైన యోచన, తాళ్ల సునిల్ నివాళుల ర్పించారు. స్థానిక నాయకులు, కళాకారులు సందర్శించి నివాళులర్పించారు. కాగా, మొగిలయ్యను చూడడానికి కులస్థులు, వివిధ గ్రామాలకు చెందిన పలువురు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జనం మధ్య క్రైస్తవ మతఆచారం ప్రకారం మొగిలయ్య అంత్యక్రియలు ముగిశాయి.



మొగిలయ్యకు నివాళులర్పిస్తున్న రచ్చ రవి, బాలు

### సంప్రదాయ కళతో..



వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన పస్తం మొగిలయ్య (67), కొమురమ్మ దంపతులు జానపదాలు, బుర్రకథలు చెబుతూ జీవనం సాగించారు. పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వస్తున్న జానపద కళల్లో ఒకటైన బుర్ర కథలే వృత్తిగా ఎంచుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు గోదావరి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో బుర్ర కథలు చెప్పేవారు. నిరక్షరాసులైనా కళలో ప్రత్యేక గుర్తింపు పొందారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని కేశవపురానికి చెందిన పస్తం వెంకటయ్య - లక్ష్మిలకు 10 మంది సంతానం. వీరిలో నలుగురు కుమా రులు, ఆరుగురు కుమార్తెలున్నారు. రెండో కుమారుడైన పస్తం మొగిలయ్య అదే గ్రామానికి చెందిన మేనమామ కడెం హన్మంతు-జానవ్వల కుమార్తె కొమురమ్మను 45ఏళ్ల కిందట వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు సుదర్శన్ ఉండగా, తన సోదరుడైన పస్తం రవి కుమార్తె మొజేష్‌ను దత్తత తీసుకున్నారు. ఊరూరా తిరుగుతూ కథలు చెబుతూ మొగిలయ్య కుటుంబం కొన్నేళ్ల కిందట దుగ్గొండికి వలస వచ్చి స్థిరపడింది. ఇందిరమ్మ కాలనీకి చెందిన గృహాన్ని కొనుగోలు చేసి నివాసంగా ఉంటున్నారు. కుమారుడు సుదర్శన్ స్టీల్ సామాన్లు కొనుగోలు వ్యాపారం చేస్తున్నాడు. దత్త కుమార్తెకు వివాహం కావడంతో అత్త వారింట్లో ఉంటోంది.

#### అప్పటికపుడు కథలు, పాటలు

దంపతులిద్దరూ నిరక్షరాసులైనా కథలు, పాటలు అల్లుకుని పాడ దం, చెప్పడం వారి ప్రత్యేకత, శకుంతల, దమయంతి, కాంభోజురాజు, అంజమ్మ తదితర కథలు చెప్పడంలో సిద్ధహస్తులు, ఏ ఊరికి వెళ్లినా ఆ ఊరిలో డేరాలు వేసుకొని కొన్ని రోజులు అక్కడే ఉంటూ కథలు చెబుతూ.. వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబం నెట్టుకొచ్చేవారు.



మొగిలయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

### బలగం సినిమాతో ప్రత్యేక గుర్తింపు

మూడేళ్ల కిందట మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడలోని ఓ ఇంటి వద్ద మొగిలయ్య దంపతుల బుర్ర కథను విన్న రాజమౌళి అనే వ్యక్తి ఈ విషయాన్ని తన బంధువైన బలగం సినిమా దర్శకుడు యెల్దండి వేణుకు తెలిపారు. దీంతో వేణు కొత్తగూడకు చేరుకొని వారి కథను, పాటలను విన్నాడు. తాను తీస్తున్న బలగం సినిమా క్లైమాక్స్ లో పాట పాడేందుకు అవకాశం కల్పించారు. సినిమా విజయవంతం కావడంతో మొగిలయ్య దంపతులకు మంచి గుర్తింపు వచ్చింది.



మొగిలయ్య దంపుతులను సన్మానిస్తున్న బలగం సినిమా డైరెక్టర్ వేణు(ఫైల్)

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : డీఈవో



చిలుపూరు కేజీబీవీలో బ్లాంకెట్లు పంపిణీ చేస్తున్న డీఈవో రమేష్

చిలుపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల్లోనే నాణ్యమైన విద్యాబోధన లభిస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) రమేష్ అన్నారు. గురువారం మండలంలోని రాజవరం పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) జీఈసీవో ఎమ్డీ గౌసియాబేగంతో కలిసి సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సౌకర్యాలు, భోజన వసతి, బోధనా విధానాన్ని విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికతో పాటు, ఇతర రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వమందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని అనంతరం ప్రభుత్వమందజేసిన బ్లాంకెట్ల (వులన్ దుప్పట్లు)ను వారికి పంపిణీ చేశారు.ఉపాధ్యాయులు సత్య, దివ్య, స్రవంతి పాల్గొన్నారు.

● బచ్చన్నపేట, (ఆంధ్రజ్యోతి) : చలి తీవ్రత దృష్ట్యా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని విద్యార్థినులకు తెలంగాణ ప్రభుత్వం అందించిన బ్లాంకెట్లను గురువారం ఎంఈవో వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనాథ్‌రెడ్డిల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సక్రమంగా వినియోగించుకుని విద్యార్థినులు బాగా చదివి ఉన్నత స్థితికి ఎదగాలన్నారు.

● జనగామ కల్చరల్, (ఆంధ్రజ్యోతి): చలికాలాన్ని దృష్టిలో పెట్టుకొని సమగ్ర శిక్ష తెలంగాణ ప్రభుత్వం కేజీబీవీలలోని బాలికలకు ఉలన్ బ్లాంకెట్లు పంపిణీ చేసినట్లు జనగామ డీఈవో ఎం.రమేష్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా లోని చిలుపూరు, స్టేషన్ ఘన్‌పూర్, తరిగొప్పులలో ఆయన జీసీడీవో గౌసియాబేగం, సమగ్ర శిక్ష ప్లానింగ్ ఆఫీసర్ రాజు, ఏఎంవో బొమ్మనబోయిన శ్రీనివాస్, సీఎంవో నర్సింహారావుతో కలిసి బ్లాంకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 12 కేజీబీవీలకు గాను 3011 బ్లాంకెట్లు వచ్చాయన్నారు. అదే విధంగా జిల్లాలోని చిలుపూరు, దేవరుప్పుల కేజీబీవీలలో సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు గాను సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రూ.50 వేల చొప్పున నిధులు మంజూరు చేసినట్లు డీఈవో పేర్కొన్నారు.



బచ్చన్నపేట: కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బ్లాంకెట్‌లను పంపిణీ చేస్తున్న అధికారులు

## బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

జనగామ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని భువనగిరి పార్లమెంట్ కో కన్వీనర్, మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కొంతం శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు లద్దునూరి మహేశ్ అన్నారు. మండల అధ్యక్షుడు మహేశ్ అధ్యక్షతన గురువారం మండలంలోని యశ్వంతపూర్‌లో సమావేశం నిర్వహించి బూత్ స్థాయి కమిటీ అధ్యక్షుడిగా మారబోయిన రాజమల్లిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మార్క ఉపేందర్, ఈర్ల నవీన్‌కుమార్, గడ్డం శ్రీనివాస్, విద్యాసాగర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్పీల సమస్యలను పరిష్కరించాలి

జనగామ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మెప్మా ఆర్పీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్పీలు కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏవో మున్సూరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెప్మా రాష్ట్ర కార్యదర్శి దుంబాల రేవంతి మాట్లాడుతూ జీవో నంబరు 60 ప్రకారం ఆర్పీలకు నెలకు రూ. 26,000 వేతనం, రెగ్యులర్‌గా వేతనాలను వ్యక్తి గత ఖాతాలో జమచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ. 10 లక్షలు కల్పించాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజేందర్, ప్రశాంతి, వాసవి, జ్యోతి, వసంత, సమత, సరిత పాల్గొన్నారు.

## మినీ మినరల్ వాటర్‌ప్లాంట్ అందజేత

బచ్చన్నపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దబకుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు దాత మాడిశెట్టి సత్యనారాయణ రూ. 20 వేల విలువ చేసే మినీ వాటర్‌ప్లాంట్‌ను అందజేసినట్టు హెచ్‌ఎం అమీర్ తెలిపారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే చదువైనా, ఆటల్లోనైనా ప్రతిభ చూపగలుగుతారని అన్నారు. తాగేనీరు పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో మినీప్లాంట్‌ను అందజేయడం జరిగిందన్నారు. పాఠశాలల బలోపేతం కోసం దాతలు ముందుకు రావడం మంచి పరిణామమని ఉపాధ్యాయులన్నారు. కార్యక్రమం లో గొట్టె కనకయ్య, శ్రీవిద్య, దీక్షిత, మమత తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన బాలికల పాఠశాల తనిఖీ

పాలకుర్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) మండలంలోని గూడూరు గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఎంపీడీవో ఆకుల రాములు గురువారం సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాలలో స్టాక్ రూముతో పాటు వంట గదిని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తుందని అన్నారు. విద్యార్థులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూను తప్పకుండా పాటించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. వంటలు వండిన తర్వాత ఉపాధ్యాయులతో పాటు వర్కర్లు భోజనాన్ని రుచి చూసిన తర్వాత విద్యార్థులకు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రేణుక, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## ఢిల్లీకి తరలివెళ్లిన బాల ఒగ్గు కళాకారులు



ఢిల్లీకి వెళుతున్న బాల ఒగ్గు కళాకారులు

లింగాలఘనపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం సాంస్కృతిక మంత్రిత్వశాఖ, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించనున్న వీర్ బాల దివస్ (బాలవీరుల దినోత్సవం)కు రాష్ట్రం తరపున లింగాల ఘనపురం మండలానికి చెందిన బాల ఒగ్గు కళాకారులు బుధవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. బాల ఒగ్గు కళాకారులకు సారథ్యం వహిస్తున్న డాక్టర్ చౌదరపల్లి రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ నుంచి 10 నుంచి 15 ఏళ్ల వయస్సు కల్గిన 24మంది కళాబృందం సభ్యులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ నెల 26న న్యూ ఢిల్లీలోని భారత మండపంలో ఉత్సవం జరుగనుందన్నారు బాల ఒగ్గుల శిక్షణకు సహకరించిన సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణకు బాల ఒగ్గుల కుటుంబాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సుంకరి శరత్, గాజర్ల బుగ్గయ్య, అశోక్, దీకొండ రాజశేఖర్, మేకల ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణలో బైండ్ల కులానికి న్యాయం చేయాలి

పాలకుర్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) ఎస్సీ వర్గీకరణలో బైండ్ల కులానికి న్యాయం చేయాలని బైండ్ల భవనీయ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముగంటి ప్రశాంత్, రాష్ట్ర కార్యదర్శి బోట్ల ఇంద్రస్వామి కోరారు. గురువారం హనుమకొండకు వచ్చిన ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమీషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను జనగామ జిల్లా పాలకుర్తి మండలం బైండ్ల కళాకారులు కలిసి వినతి పత్రం అందచేశారు. జముడిక వాయిద్యాలతో కళా ప్రదర్శనకు ఛైర్మన్ అబ్బురపడాడు. ఆరు లక్షల పై చిలుకు ఉన్న బైండ్ల కులానికి న్యాయం చేయాలని, ఎస్సీ ఏ జాబితాలో చేర్చి ఏడు శాతానికి తగ్గకుండా రిజర్వేషన్ కల్పించాలని కమీషన్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎలమకంటి సతీష్, జిలకర కృష్ణాకర్, మారపాక రమేష్, రవి ఉన్నారు.

## అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

(5వ పేజీ తరువాయి)

మేడ శ్రీను, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు చెంచారపు బుచ్చిరెడ్డి, డాక్టర్ రాజమౌళి, మిద్దెపాక సిద్దులు, గనిపాక మహేందర్, గంగం నర్సింహరెడ్డి, లింగాల నర్సిరెడ్డి, జక్కుల అనిత, దాసరి క్రాంతి, చిర్ర హన్మంతరెడ్డి, స్టాలిన్ పాల్గొన్నారు.

● అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్)ఆర్టీసీ చౌరస్తా వద్ద అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బోట్ల శేఖర్ మాట్లాడారు. అమిత్ షా క్షమాపణ చెప్పకపోతే దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుటి దేవదానం, మబ్బు ఉప్పలయ్య, పల్లెర్ల లలిత, గడ్డం యాదగిరి పాల్గొన్నారు.

● అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట అమిత్‌షాకు వ్యతిరేఖ ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ నీర్నాల రత్నం మాట్లాడుతూ బహుజనులకు అంబేద్కర్ దేవుడితో సమానమని, అంబేద్కర్ జోలికి వస్తే ఊరుకునేదని లేదని హెచ్చరించారు. బీజేపీ భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర పన్నుతుందన్నారు. కార్యక్రమంలో మడిపడిగ చంద్రశేఖర్, రాపాక శ్రీశైలం, జెరిపోతుల మల్లయ్య, అర్జున్, జలగం ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో వేగం పెంచాలి



తమ్మడపల్లిలో ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బచ్చన్నపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలతో కూడిన సర్వే వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయడంతో పాటు, సర్వేలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో గురువారం జరుగుతున్న సర్వే తీరును పరిశీలించారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిశ్చయించిందని, ఈ నెలఖరు లోగా సర్వే పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తం గా ఎన్ని దరఖాస్తులకు సంబంధించిన సర్వే పూర్తి చేశారని అధికా రులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎస్‌టీ ప్రకాశ్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనాథ్, సర్వేటీం సభ్యులు పాల్గొన్నారు.

● చిలుపూర్ (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని నష్కల్, వంగాలపల్లి, చిన్నపెండ్యాల తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది నిర్వహిస్తున్న ఇళ్ల సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఈడీ మాధవీలత మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా దరఖాస్తు ఫారాల్లో కుటుంబాలు నమోదు చేసుకున్న వివరాల ఆధారంగా వారి వారి నివాసాలకే వెళ్లి క్షేత్రస్థాయి వివరాలను నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి తౌటిరెడ్డి శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

లింగాలఘనపురం డిసెంబరు 19, (ఆంధ్రజ్యోతి): పశువులకు వచ్చే గర్భకోశ వ్యాదుల పట్ల రైతులు అప్రమత్తతో ఉండి వాటికి నివారణ మందులు విధిగా వేయించాలని పశుగణ అభివృద్ధి సంస్థ కార్య నిర్వహణ అధికారి డాక్టర్ వి.రఘుబాబు తెలిపారు. గురువారం మండలంలోని కుందారం గ్రామంలో పశుగణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గర్భకోశ వ్యాదుల చికిత్స శిబిరం, దూడల ప్రదర్శన కార్యాక్రమంలో ఆయన పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పాడి పరిశ్రమ అభివృద్ధి పై దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భ ంగా రైతులకు పశువులకు సంబంధించిన మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో డాక్టర్ భగవాన్ రెడ్డి, జయపాల్ రెడ్డి, జేవీవో శ్రీనివాసులు, విజయ డెయిరీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, గోపాల మిత్రలు వీరస్వామి, రమేష్, ఎమ్డీ యాకుబ్‌పాషా, శోభన్‌బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయం

రఘునాథపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్రంలో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఊడుగుల రమేష్ అన్నారు. మండలంలోని మండేలగూడెం గ్రామంలో గురువారం జరిగిన బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక కార్యక్రమానికి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్న ధీమాను వ్యక్తం చేశారు. అంతకు ముందు జరిగిన ఎన్నికలలో బూత్ అధ్యక్షుడిగా డ్యాగల రాజన్న, ప్రధాన కార్యదర్శిగా బత్తిని అరవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, గాదె ఉపేందర్, బోళ్ల అఖిల్, రాజ్‌కుమార్, గుజ్జుల సత్యనారయణ, పంతుల జయరాం, అనిల్ కుమార్, అజయ్, నవీన్ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

చిలుపూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సిబ్బందిపై దుర్భాషలాడిన పంచాయతీ కార్యదర్శి బాహూనాయక్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. మండలంలోని పల్లగుట్టలో గురువారం జీపీ కార్మికులు విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జీపీ కార్మికుల సంఘం జిల్లా నాయకుడు, స్థానిక కారోబార్ జీడి ఆనందం, కేశోజు వెంకట్రాజం మాట్లాడుతూ, నిబంధనల మేరకు ప్రతీరోజు పనిచేస్తున్నా ఆరు నెలలుగా తమను అకారణంగా వేధిస్తున్నారని, ఈ నెల 18న గ్రామంలో చేపడుతున్న డ్రెయినేజీ నిర్మాణం విషయంలో గ్రామస్థుల ముందు తీవ్ర దుర్భాషలా డాడని ఆవేదన వ్యక్తం చేశారు. తగు విచారణ జరిపించి, తమకు న్యాయం చేయాలని కోరారు. సిబ్బంది జీడి వెంకటయ్య, దార చేరా లు, సింగపురం యాదగిరి, ఇసురం సౌభాగ్య, దార రజిత పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి



గ్రామ కమిటీ సభ్యులతో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, లింగాల జగదీష్ చందర్ రెడ్డి

రఘునాథపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి అన్నారు. మండలంలోని కోమల్ల కాంగ్రెస్ గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొల్లపల్లి కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా పెంట గట్టమల్లు, ప్రధాన కార్యదర్శిగా తాళ్లపల్లి యాదగిరి, సహాయ కార్యదర్శులుగా మారోజు లక్ష్మీనారయణ, నీల సంపత్, కోశాధికారిగా బాల్నే పరుశరాములు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నిక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాంబాబు, జగదీష్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల నరేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, బంద కుమార్, తోటకూరి రమేష్, గోపాల్ కిషన్‌రావు, సుల్తాన్ నర్సింహా రెడ్డి, బొల్లపల్లి మధుసూదన్, తాటికొండ వెంకటేష్, మల్లీఖార్జున్, ఉపేందర్, వెంకటస్వామి, నర్సిరెడ్డి, సత్తయ్య, సంపత్ రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

## ఎంపీవోకు సమ్మె నోటీసు అందజేత

రఘునాథపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఈ నెల 17 జరిగిన ధర్నాకు తరలి వెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా ఈ నెల 27, 28 తేదిలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సమ్మె నోటీసును మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లుతో పాటు ఎంపీడీవో శ్రీనివాసులుకు జీపీ కార్మికులు గురువారం అందజేశారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఉమ్మగోని రాజేష్, ప్రధాన కార్యదర్శి నల్ల రాజయ్య, రాపోలు రాజ్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# మీరాబాయి వేషధారణ మెచ్చి .. అచ్చం అలానే గీసి ...

### గూడూరు విద్యార్థినీ చిత్రాన్ని గీసిన హిందీ ఉపాధ్యాయుడు



ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న తోటి ఉపాధ్యాయులు

పాలకుర్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) 16 శతాబ్దానికి చెందిన ప్రముఖ కవయిత్రి మీరాబాయి వేషధారణ వేసిన బాలిక చిత్రాన్ని అచ్చు గుద్దినట్లుగా అలానే గీసిన ఉపాధ్యాయుడు ఔరా అనిపించాడు. సెప్టెంబరు నెలలో మండలంలోని గూడూరు జెడ్పీఉన్నత పాఠశాలలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మూడు మండలాల హిందీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. హిందీ ఉపాధ్యాయుల సమావేశం కావడంతో ఆ భాషలో పేరుగాంచిన కవయిత్రి మీరాబాయి వేషధారణను పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని అమూల్యతో వేయించారు. ఆ సమావేశానికి వచ్చిన దేవరుప్పుల మండలంలోని చౌడూరులో హిందీ పండిట్‌గా కుమారస్వామి పని చేస్తున్న ఉపాధ్యాయుడు చిన్నారి వేషధారణకు ముగ్దుడయ్యాడు. స్వతహాగా చిత్రకారుడైన ఉపాధ్యాయుడు ఇంటికి వెళ్లాక మీరాబాయి వేషంలో ఉన్న చిన్నారి అమూల్య రూపాన్ని అచ్చు గుద్దినట్లు గీసి అబ్బురప రిచాడు. గురువారం మండలంలోని గూడూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరుగగా సదరు చిత్రాన్ని విద్యార్థిని అమూల్యకు అందజేశాడు. ఉపాధ్యాయడు కుమారస్వామి ప్రతిభకు ఆ పాఠశాల హెచ్‌ఎం శైలజ, ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు.

# ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

### తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ కుమారస్వామి



దీక్షలకు సంఘీభావం ప్రకటిస్తున్న కోడం కుమారస్వామి

జనగామ కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ కోడం కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన దీక్షలు గురువారం 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు కోడం కుమారస్వామి, డాక్టర్ మాచర్ల భిక్షపతి, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు గడ్డం మనోజ్‌కుమార్, జరసం ప్రతినిధులు జి.కృష్ణ, సోమనరసింహాచారి, లగిశెట్టి ప్రభాకర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కాంట్రాక్టు వ్యవస్థ రద్దు చేస్తామని తెలిపినప్పటికీ ఆచరణ సాధ్యం కాలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ అధ్యక్షుడు తాడూరి రమేష్, బైరగోని దయాకర్, గోలి రవీందర్‌రెడ్డి, శ్రీలత, శ్రీనివాస్, రాణి, రమ్య, మహాలక్ష్మి, అన్నపూర్ణ, మమత తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ దగ్ధం : పోలీసులకు ఫిర్యాదు

జఫర్‌గడ్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మంపేటలో పోషయ్య అనే రైతు తన పంట పొలంలో వరి కొయ్యలకు నిప్పుపెట్టడంతో.. ఆ మంటలతో పక్క భూమి రైతు గాదె వెంకటరత్నంకు చెందిన ఆయిల్ పామ్ పంటకు అంటుకుని దగ్ధమైంది. ఈ మేరకు బాధిత రైతు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధిత రైతు వెంకటరత్నం తెలిపిన ప్రకారం పోషయ్య అనే రైతు పంట కోసిన పొలంలో వరి కొయ్యలకు నిప్పు పెట్టాడని, అయితే ఆ మంటలు లేచి పక్కనే గల ఆయిల్‌పామ్ పంటకు అంటుకున్నాయన్నారు. బుధవారం సాయంత్రం పంట క్షేత్రానికి వెళ్లి చూడగా మొక్కలు కాలిపోయాయని తెలిపాడు. నష్టంపై అంచనా వేసి తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరాడు.

## ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇవ్వాలి

పాలకుర్తి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యూ నరేషన్ ఇవ్వాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టి ఇరవై రోజులు కావస్తున్నప్పటికి ఇంత వరకు ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇవ్వలేదని అన్నారు. అదే విధంగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు అటెండె న్స్ సర్టిఫి కెట్లను జారీ చేసేలా ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

## మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్టు

కొడకండ్ల డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి హాజరవడానికి బయలుదేరిన మలమహానాడు నాయకులను గురువారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల వెంకన్న మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తెలంగాణా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి రాష్ట్రకమిటీ పిలుపు ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి హా జరడానికి సిద్ధమవుతున్న తమను పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపా రు.

● చిలుపూర్ (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో భాగంగా, మాల మహానాడు ఆధ్వర్యంలో గురువారం చేపట్టనున్న అసెంబ్లీ ముట్టడిని పురస్కరించుకుని, ఆయా గ్రామాలకు చెందిన నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని వ్యక్తిగత పూచీకత్తుపై సాయంత్రం విడుదల చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో వెంకటాద్రిపేట మాజీ సర్పంచ్ కందుల రఘుపతి, తమ్మాలి రాజు, బోగం రాజేందర్, ఎనమల్ల వెంకటస్వామి, ఎడ్ల నర్సయ్య ఉన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను కామర్స్, పొలిటికల్ సైన్స్‌లో ఒక్కో పోస్టుకు ఈ నెల 28వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు సరిపోతాయన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు డిసెంబరు 30న ఉదయం 11 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

## 22న కాకతీ కదనభేరికి తరలిరావాలి

జనగామ కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 22న వరంగల్ లోని ఇస్లామియా గ్రౌండ్‌లో నిర్వహించే కాకతీ కదనభేరి మహాసభను విజయవంతం చేయాలని పాత పెన్షన్ సాధన సమితి జిల్లా అధ్యక్షులు కాకాని లక్ష్మణమూర్తి కోరారు. జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్, చిలుపూరు, తరిగొప్పుల, నర్మెట్ట, జనగామ మండలాలోని పలు స్కూళ్లలో కాకతీ కదనభేరి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఆదివారం ఇస్లామియా గ్రౌండ్‌లో జరిగే సభకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమ ంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలిసోజు లింగమూర్తి, బెజ్జం సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

## రేపు గుండె వైద్య శిబిరం

జనగామ కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఒత్తిడితో కూడిన జీవన ఫలితంగా అనేక మంది గుండె జబ్బులతో బాధపడుతున్నారని, వైద్య ఖర్చులు అందుబాటులో లేని పేదలకు శనివారం గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జన విజ్ఞాన వేదిక, అరబిందో ఆశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు ప్రసాదరావు నేతృత్వంలో శనివారం ఉదయం మండలంలోని చంపక్‌హిల్స్‌లో ఉదయం 10 గంటలకు హార్ట్ స్క్రీనింగ్ టెస్టుల కొరకు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఘనంగా పెన్షనర్స్ దినోత్సవం

జనగామ కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ ఆధ్వర్యంలో గురువారం పెన్షనర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రోజు రామస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 85 మంది పెన్షన్ దారులు హాజరు కాగా 26 మంది పింఛన్‌దారులకు శాలువాతో సన్మానించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, ఎం.జనా ర్దన్‌రెడ్డి, సరాబు వీరన్న, విఠల్‌రెడ్డి, ఎండి.దస్తగిరి, చంద్రారెడ్డి, అంబటి రాజయ్య, తొలుపునూరి రామచంద్రం, కొత్తూరి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

## టీఎన్‌జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రభాకర్

జనగామ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీవో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జిల్లాకు చెందిన పెర్వారం ప్రభాకర్‌ను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ నియమించారు. ఆయనతో పాటుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ముజీబ్ హుస్సేన్, అసోసియేట్ అధ్యక్షుడిగా కస్తూరి వెంకటేశ్వర్లును నియమించారు. అనంతరం ప్రభాకర్‌ను యూనియన్ నాయకులు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్, జిల్లా కార్యదర్శి పెండెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కురుమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

లింగాలఘనపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లుట్లలో కురమ సంఘం నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా గొరిగె సంపత్, ఉపాధ్యక్షుడు మామిల్ల అంజనేయులు, గొరిగె మధు, ప్రధానకార్యదర్శిగా మద్దూరి రాజు, కోశాధికారిగా గొరిగే సందీప్, సహయ కార్యదర్శులుగా బండి ప్రవీణ్‌కు మార్, బర్ల సత్తయ్య, బండి పాపయ్య, గౌరవ సలహాదరులుగా కడకంచి మల్లేషం, గట్టయ్య,ఉప్పలయ్య, గౌరవ అధ్యక్షుడిగా అంజనేయులు ఎంపికయ్యారు.

## డీహెచ్‌పీఎస్ సభలను జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

జనగామ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) బహిరంగ సభలను జయప్రదం చేయాలని గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో డీహెచ్‌పీఎస్ నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి పైస రాములు మాట్లాడుతూ అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం 2వ జాతీయ మహసభల సందర్భంగా జనవరి 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జనవరి 5న జరిగే సభకు నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ఓల్డ్ ఏజ్ హోమ్‌లో నిత్యావసర సరుకుల పంపిణీ

జనగామ కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జనగామ మండలం రుద్రమదేవి ఓల్డ్ ఏజ్ హోమ్‌లో గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎండబట్ల నర్సింగరావు - దేవేంద్ర కుమార్తె ఎండబట్ల మానస 30వ జన్మదిన వేడుకలు వృద్ధాశ్రమంలోని వయోవృద్ధుల మధ్య జరుపుకున్నారు. కేక్ కట్ చేసి వృద్ధులకు మిఠాయి పంపిణీ చేశారు. భోజన వితరణతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాల్క లక్ష్మణ్, సుంకరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.